# శిథిల విపంచి

పట్నం రూపుదిద్దుకుంటున్న పల్లెటూరు బయట ఓ గుడిసె. గుడిసెలో గుండెతడి ఆరని బొందయ్య..... పెద్దకొడుకు పంపించిన భోజనం అయిందనిపించాడు. కష్టాల కడలి నీదుతూ సుఖజీవన యానానికి కావల్సిన హంగులన్నీ సమకూర్చుకున్న తననేశక్తి ఆవహించింది!... మనసు ఆకాశములో గతం పక్షి రెక్కలు విప్పి ఎగురుతోంది....

xxxx

... ఒకపూట తింటే మరోపూట కూటి కోసం వెతుక్కునే కుటుంబములో కళ్లు తెరిచాడు. ఐదేళ్ల వయసులో అమ్మానాన్నలు పై లోకాల కెళ్ళిపోయారు. నా అనే వారెవ్వరూ లేరు. అనాథగా అంగలార్చుతూ తెగిన గాలిపటములా తిరుగుతూంటే రామాలయం పూజారి చేరదీసి ఆశ్రయమిచ్చాడు. పితృవాత్సల్యమంటే ఏమిటో రుచి చూపించాడు.

పొద్దు పొడవకముందే నిద్రలేవడం, గుడి కడిగి శుభ్రం చెయ్యడం... రోజువారీ కార్యక్రమమైంది. అది తన ఇష్టపూర్తిగా చేసిందే తప్ప ఎవరి ఒత్తిడి లేదు. రథముగదిలో నివాసము. రాత్రికి గుడి మంటపము మీద పడుకోవడం అలవాటైంది. పొద్దున్నే పూజారితో టీ తాగడం, బడికెళ్లడం, మధ్యాహ్నం-రాత్రికి పులిహోరా-దద్దోజనముతో కడుపు నింపుకోవడం... కష్టమనిపించలేదు. ఇష్టపూర్తిగా ఆరగించేవాడు. కాలేజిలో చేరాక గుడి కార్యాలయం పని బాధ్యత పంచుకుని రాతకోతలు చూడ్డం... రొటీనైపోయింది. ఫీజులు, పుస్తకాల ఖర్చులు పూజారి భరించేవాడు. బ్రహ్మోత్సవాలప్పుడు కాలేజి మానేసి దైవ కార్యక్రమములో పాలుపంచుకోవడం తృప్తిగా ఉండేది.

డిగ్రీ ఫస్టు క్లాసులో పాసైనా ప్రభుత్వఉద్యోగం దొరకలేదు. పూజారి పూచీకత్తుపై ధర్మకర్త కొబ్బరికాయలు, పూజాద్రవ్యాల అమ్మకం కాంట్రాక్టు తనకిచ్చాడు. గుడి తెరిచి ఉన్నంతసేపు అమ్మకాలు జోరుగా సాగేవి. కలిసొచ్చే కాలానికి నడిచొచ్చే సిరి నెవరాపగలరు! మూడు సంవత్సరాల ఆదాయం సివిల్ పనుల కాంట్రాక్టరుగా నిలబెట్టింది. కలిమి బలిమితో కాంట్రాక్టులు బాగానే లభించాయి. సమాజంలో గుర్తింపు లభించింది. గుడి ధర్మకర్త తన కూతురునిచ్చి రంగరంగవైభోగంగా పెళ్లి చేసి పదిమందికి పరిచయం చేశాడు.

చదువుకున్న శారద అక్షరాలా అర్ధాంగియై తనకు కుడిభుజమైంది. బాగా ఆలోచించి టెండరు ఫారాలు నింపడం, కాంట్రాక్టు పనుల బిల్లులు రాయడం, బ్యాంకు లావాదేవీలు చూసుకోవడులో ఆరితేరింది. అనురాగాన్ని పంచుతూ ముత్యాల్లాంటి ముగ్గురు కొడుకులకు జన్మనిచ్చింది. రోజులు హాయిగా గడుస్తున్నాయి. బంగళా, కారు, నౌకర్లు.... చాలా అమిరాయి.

ఓ రోజు పూజారి తనింటికొచ్చాడు. సంతోషంగా స్వాగతించారు. పూజారి తనను ఆ పాదమస్తకం పరిశీలించి "శ్రీరాములూ! ఊరిమధ్యలో నువు పెరిగిన రామాలయములో భక్తుల రద్దీ బాగా పెరిగిపోయింది. ఊరవతల ఓ శ్రీ వేకంటేశ్వరాలయం కట్టిస్తే సౌకర్యంగా ఉంటుంది. ఆ సత్కార్యానికి నువ్వే పూనుకోవాలి." సూచించాడు. దాన్నే తను ఆదేశముగా భావించాడు.

చావుపుట్టుకల చక్రభ్రమణములో కొట్టుమిట్టాడుతున్న జీవాత్మ పరమాత్మ కోసం సాధించాల్సిన పరమార్థం గుర్తుకొచ్చింది. దేవాలయాలు ఎందరో అనాధలకు ఆశ్రయమిచ్చి ఆదుకునే పునరావాసకేంద్రాలు. వెంటనే సరేనన్నాడు. కానీ... ఓ సందేహం తలెత్తింది. "మీ మార్గదర్శనములో నేను గుడి కట్టిస్తాను. కాని దానికి మీలాంటి సమర్థుడైన పూజారి లభించాలి కదా!" అడిగేశాడు.

పూజారి మొహం వికసించింది. "కొత్తగుడిలో నేనే పూజారిగా పంజేస్తాను. రామాలయంలో వేదవిద్య పూర్తిచేసుకున్న నా పెద్దకొడుకు పంజేస్తాడు. అన్నట్టూ... నా చిన్న కొడుకు గూడా వేదపాఠశాలలో విద్య నభ్యసిస్తున్నాడు. నీకు తెలుసు గదా శ్రీరాములూ!" కమ్మని సంగతులు తియ్యగా చెప్పాడు.

పూజారికి సంతాన సౌభాగ్యం ఆలస్యంగా లభించిందని తనకు తెలుసు. "తెలుసు. మీ ఆదేశాన్ని తు.చ. తప్పకుండా పాటిస్తాను." అభయ హస్తమందించాడు.

పెట్టుబడి తనది, పనులు చేయించేది తన మనుషులు, సలహాలు పూజారివి.. అన్ని హంగులతో ఊరి చివర శ్రీ వేంకటేశ్వరాలయం వెలసింది. మనసు మయూరమై నర్తించింది. ప్రతిష్ఠ కార్యక్రమం శాస్త్రోక్తంగా జరిగింది. కొత్త గుడిలో త్వరలో భక్తుల రద్దీ బాగా పెరిగిపోయింది. గుడి చుట్టూ దుకాణాలు ముందుచూపుతో తాను కట్టించినవే. వాటి అద్దెలు గుడి ఆదాయమే. ఆ దుకాణాలు ఆసరాగా కొన్ని కుటుంబాలు జీవిస్తున్నాయి. అప్పటికే తన ఆస్తులు కొన్ని రెట్లు పెరిగాయి. ముగ్గురు కొడుకుల పెళ్ళిళ్లు అట్టహాసంగా జరిగాయి.

అంతలోనే దురదృష్టం కాటేసింది. గుండెపోటుతో భార్య శారద ప్రాణాలు అనంత వాయువుల్లో కలిశాయి. లోకమంతా చీకటిగా కనిపించింది.

పైపత్నీకం ఎంత భయంకరమో తెలిసొచ్చింది. ఒంటరి బతుకు జైలు శిక్షలాగనిపించింది. "కలిసిమెలిసి ఉండలేమని కొడుకులు ఆస్తులు పంచుకున్నారు. "నా సంగతేమిటి?" అని వాళ్లనడిగాడు. ముగ్గురూ నాలిక్కరుచుకుని సంప్రదించుకున్నారు. ఒక్కోనెల ఒకరింట్లో ఉండాలని నిర్ణయించారు. అదే తన పాలిట ఆశనిపాతమైంది. స్వాభిమానాన్ని దిగమింగి కోడళ్లు పెట్టిందే తినాల్సి వచ్చింది. కుక్కిన పేనులా పడుండాల్సి వచ్చింది.

రానురాను తన ఉనికి వాళ్ల సరదాలకు అడ్డుగోడగా పరిణమించింది. ఓసారి తనముందే దెబ్బలాడుకుని "ఈ ముసలోని పీడావదిల్తే మనకు సుఖం" అన్నారు. అంతరాళాల్లో సునామి అలలు ఎగసి పడ్డాయి. నా కష్టార్జితాన్ని అనుభవిస్తున్నావాళ్లకు నేను చేదయానా? మనసు ఆక్రోశించింది.

XXXX

ఓ రోజు... సంపన్నుడు శ్రీరాములు షడన్‌గా నేలమీద జారిపడి మెలికలు తిరుగుతున్నాడనే వార్త ఊరంతా వ్యాపించింది. కొడుకులు డాక్టర్ను తీసుకొచ్చారు. డాక్టరు నాడి చూసి పెదవి విరిచాడు. "అయ్యో నాన్నా! నీకప్పుడే నూరేళ్లు నిండాయా?" అంటూ కొడుకులు గుండెలు బాదుకున్నారు. కోడళ్లు తృప్తిగా శోక రాగాలందుకున్నారు. "నువ్వు మా దైవానివి మావయ్యా" అంటూ పొగిడారు.

బంధువులనే వాళ్ళంతా వచ్చారు.

"ఆలస్యమెందుకు? త్వరగా కానీండి. శవం కుళ్ళిపోతుంది" అంటూ హడావుడి చేశారు అంతిమ యాత్రలో వేలాది మంది బారులు తీరారు. పూడ్చివేయడం ఆచారం కాబట్టి బొంద తోడించారు. అంతిమయాత్ర బొందలగడ్డకు చేరుకుంది. దింపుడు కల్లం వద్ద పాడె దించారు. శ్రీరాములు ఒంటిమీదున్న బంగారు

గొలుసు, ఉంగరాలు, వెండి మొల తాడు తొలగించారు. ఆచారాన్ననుసరించి శ్రీరాములు చెవిలో పెద్దకొడుకు, రెండవకొడుకు "నాన్నా" అని పిలిచారు. చివరగా చిన్నకొడుకు మరోచెవిలో "నాన్నా, శ్రీరాములు నాన్నా!" అని గట్టిగా పిలిచాడు.

ఆశ్చర్యం, అనూహ్యం... అద్భుతం! శ్రీరాములు నిద్రలోంచి మేల్కొన్నట్లు లేచి కూచున్నాడు. గట్టిగా ఆవులించాడు. కళ్లు నులుముకున్నాడు. "అయ్యో! ఇదేమిటీ!" అంటూ పాడె దిగి నుంచుని ఒంటిమీది గుడ్డలు సరిచేసుకున్నాడు. మొదట అంతా హడలిపోయారు. ఆతర్వాత ఏవేవో ప్రశ్నా బాణాలు సంధించారు. జవాబులన్నీ సరిగానే వున్నాయి.

"నిజమే" శ్రీరాములు చావలేదు. బతికే ఉన్నాడు. ఇదంతా ఆ దైవలీల." అన్నాడో పెద్దమనిషి" అంతా గుసగుసలాడుకున్నారు.

"చనిపోయి దింపుడు కల్లం వద్ద బతికొచ్చిన మనిషి ఊళ్లోకొస్తే ఊరికి అరిష్టం" అన్నాడో సీనియర్ సిటిజన్.

"మరి అతడెక్కడుండాలి! ఏంతినాలి?" అడిగారెవరో. ఆ పెద్దమనుషులు చెవులు కొరుక్కున్నారు.

"బొందలో ఉండాల్సిన మనిషి బొందితో తిరిగొచ్చాడు. కాబట్టి అతన్ని బొందయ్య అని పిలవాలి. ఊరిబయట గుడిసె వేసి అందులో ఉంచాలి. అన్నపానీయాలు అక్కడికే పంపించాలి." ఏకగ్రీవ తీర్మానం వెలువడింది.

అలనాటి శ్రీరామచంద్రునికే వనవాసము తప్పలేదు. మానవమాత్రుడిని నేనెంత? అనుకున్నాడు. కొడుకులు కూడబలుక్కుని ఊరిబయట చెరువు దగ్గర వేయించిన గుడిసెలో ఉంటున్నాడు. కోట్లకు పడగెత్తిన శ్రీరాములు అనాధ బొందయ్యగా అవతరించాడు. అదీ సంగతి.

పూరిగుడిసెలో బొందయ్య గుండెలు బాదుకుంటూ గోడుగోడు మంటున్నాడు. కాలేకడుపుకు మండే గంజిలా... కోడళ్లు పంపించింది తినాలి... చెరువు నీళ్ళు తాగాలి. అక్కడి నుండి తాను కట్టించిన శ్రీ వేంకటేశ్వరాలయం శిఖరం కనబడుతోంది. ఆ గుడిగంటల మోతలు, భజనలు వినబడుతున్నాయి. గుడికి వచ్చే పోయే భక్తులు కొందరు కనబడుతున్నారు.

భగవంతుడా! నన్నెందుకు పుట్టించావు? అనాథకు అన్ని ప్రసాదించి శ్రీమంతుడిగా ఎదిగించావు. నీ లీలావిలాస మేమిటో కాని మళ్లీ బికారిగా మార్చావు. ఈ లోకములో నాకేమి మిగిలింది.? ఇంతకూ నేనిప్పుడు మనిషినా, దెయ్యాన్నా? జీవచ్ఛవములా ఎంతకాలము పడుండాలి? నన్ను నీలో చేర్చుకో స్వామీ... మనసు ఆక్రోశిస్తోంది. కంటిధారలు కపోలాలను తడిపేస్తున్నాయి. నీవే తప్ప ఇతప్పరం బెరుగ... నంటూ చేతులెత్తి మొక్కాడు.

నాల్రోజుల క్రితమోసారి ప్రాణాలరచేతిలో పెట్టుకుని పెద్దకొడుకు ఇంటి ముందు కెళ్లి కోడల్ని పిలిచాడు. పెద్దకోడలతన్ని చూడగానే కెవ్వున కేకేసి "వామ్మో! దెయ్యం. వింతదెయ్యం" గట్టిగా అరిచి లబలబలాడింది.

బిలబిలమంటూ చుట్టూ జనాలు మూగారు.

"ఓర్నీ... బొందయ్యా ఊళ్లోకొచ్చావా! నిన్నెవరు రానిచ్చారు? ఊరికి అరిష్టం. వెళ్లు... వెంటనే వెళ్ళకపోతే రాళ్లతో కొట్టి చంపేస్తారురా దెయ్యమా!" తలోమాట.

మాటల ఈటెలతో చిత్రహింసకు గురిచేశారు.

"నా ఇంటికి నేనొచ్చాను." మొండిగా జవాబిచ్చాడు.

"నీ ఇల్లు ఇదికాదు, బొందలగడ్డ. వెళ్ళిపో!" పెద్దకొడుకు ఉరిమాడు.

"ఎందుకెళ్ళాలి? నా ఇంట్లో నేనుంటా!"

మిగతా కొడుకులెప్పుడు చేరుకున్నారో అక్కడికి. అందరి కళ్లల్లో అసహ్యం పేరుకుపోయింది. అయినా తనను ముట్టుకునేందుకెవ్వరూ సాహసించలేదు.

అష్టకష్టాలు పడి కట్టించిన బంగళా తనది కాదా! రక్తంపంచుకు పుట్టిన కొడుకులు తనపాలిట యమదూతలా! తననో వింత జంతువులా చూస్తున్నారెందుకూ! వీళ్లంతా మనుషులేనా...?

ముగ్గురు కొడుకులు కూడబలుక్కుని తనమీదికి నలుగురు కిరాయి గూండాలను పంపించారు. నలుగురు నరరూప రాక్షసులు లాక్కెళ్లి గుడిసెలో విసిరేశారు.

గుండెలు మండిపోతుంటే మనసు శిథిలమైంది. శిథిల విపంచిగా మారి శోక రాగమాలపించింది. శ్రీ వేంకటేశ్వరాలయం వైపు తిరిగి మోకాళ్ళు నేలకానించి కూచున్నాడు. గాల్లోకి చేతులెత్తి మొక్కాడు. పొత్తి కడుపులోంచి పొంగుకొస్తున్న ఆవేదన శరీరాన్ని వణికిస్తోంది. "భగవంతుడా! మకరి బారిన పడిన కరిని పరుగెత్తుకెళ్ళి రక్షించావే. పసికూన ప్రహ్లాదుడిని కాపాడావే! దీనబంధూ! ఈ ఆపదల నుండి నన్ను కాపాడలేవా!" గొంతెత్తి మొరపెట్టుకున్నాడు.

"శ్రీరాములూ... శ్రీరాములుగారూ..." ఎప్పుడో విన్న గొంతు. కళ్లు తెరిచాడు. ఎదురుగా పూజారి. కళ్లునలుముకుని చూశాడు. అవును. తన భవిష్యత్తుకు బాటలు వేసిన పూజారే...! "అయ్యా! నేనిప్పుడు మనిషినా, దెయ్యాన్నా?" గుండెలు బాదుకుంటూ బోరుమన్నాడు. కళ్లు ఊటచెలిమలైనాయి. పూజారి పాదాలందుకోబోయాడు.

పూజారి ఎదపొదలోని అల్లకల్లోలం కళ్లల్లోకొచ్చింది... "శ్రీరాములూ! లే నాయనా! భుజాలు పట్టి లేపి గుండెలకు హత్తుకున్నాడు. "జరిగిందంతా విన్నాను. పదిరోజుల నుండి ఊళ్లోలేను. నీగుడిని నా రెండో కొడుక్కి అప్పజెప్పి ఊరెళ్లాను. పొద్దున్నే వచ్చి అంతా విన్నాను. నీకు ఘోరమైన అన్యాయం జరిగింది రా... నాతో...రా!!" ప్రేమగా వీపునిమిరాడు.

భగబగమండే వెన్నుపూనకు వెన్నపూన రాసినట్టైంది. "నిజంగానా పూజారిగారూ!" సజలనయనాలతో పాదనమస్కారం చేశాడు. పూజారి ఆప్యాయంగా లేవనెత్తాడు. "శ్రీరాములూ! నువు మానవత్వం మూర్తీభవించిన మనిషివి. నువ్వు కట్టించిన బంగళా నీది కాకుండా పోయినా,నువ్వు కట్టించిన గుడి తలుపులు నీకోసం తెరుచుకున్నాయి. అదేగుడిలో శేష జీవితం హాయిగా గడిపేద్దువు పద! నీకు నేనున్నాను. ఆ తర్వాత దేవుడున్నాడు. చచ్చిబతికిన మనిషిని ఊళ్లోకి రానివ్వొద్దని ఏ శాస్త్రమూ చెప్పలేదు. అదో సాంఘిక దురాచారము. నీ జీవితం గుడిలోనే వికసించిందిగదా! జీవన సంధ్య గుడి ఒడిలోనే గడుస్తది పదా! లోకం కాకి... ఎవరేమికూసినా నేను పట్టించుకోను. పద శ్రీరాములూ!" చెయ్యిపట్టుకుని నడిపిస్తున్నాడు.

శిథిలవిపంచి చైతన్య మందుకుంది.

--- × ---

(చేతన, జూన్-2012)